క్లుప్తంగా

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్ పరిధిలోని కాపుల రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. స్థానికులతో పాటు, పరిసర ప్రాంతాల వారు భారీ సంఖ్యలో హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నదాన కార్యక్రమంలో వడ్డన చేశారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



మెరిట్ విద్యార్థులను సత్కరిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: పదో తరగతిలో 500కి పైబడి మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులను అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నగదు పురస్కారంతో సత్కరించారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌తో ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించేందుకు గత పదేళ్లగా మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ, డాక్టర్ శిరీష్, డాక్టర్ కుమార్‌యాదవ్, డాక్టర్ వెంకటరమణ, రెడ్నం రాజా, శ్రీనగేష్, రాఘవరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనమ్మ తీర్థం



కరప: గ్రామంలోని అగ్నికుల క్షత్రియుల కులదేవత ధనమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వారం రోజుల ముందు నుంచీ అమ్మవారి ప్రతిరూపమైన గరగలను ఊరేగించారు. శనివారం రాత్రి తెల్లవార్లూ గరగ నృత్యాలు, గారడీ, డప్పు వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించారు. ఏటా చైత్ర మాసంలో పౌర్ణమి తర్వాత ఆదివారం రోజున అగ్నికుల క్షత్రియులు తమ కులదేవత ధనమ్మ తల్లి తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అగ్నికుల క్షత్రియులు నాలుగు రోజుల ముందునుంచి వేటకు వెళ్లకుండా జాతర, తీర్థానికి ఏర్పాట్లు చేస్తారు. అగ్నికుల క్షత్రియులతో పాటు గ్రామస్తులు వచ్చి ధనమ్మ తల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పట్టా లక్ష్మణ్, మైల నాగభూషణం, కొప్పాడ సత్తిబాబు, కల్లు రాజు, వాడ్రేవు ధర్మరాజు, మైల నరసింహమూర్తి, పట్టా రామకృష్ణ, పట్టా తాతబాబు, లంకే వీరబాబు, మైల శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించే మేనిఫెస్టో

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే ద్వారంపూడి
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా, అన్నివర్గాలకూ మేలు చేసేదిగా ఉందని పార్టీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన స్థానిక 25వ డివిజన్ నరసింహ రోడ్, భానువారివీధి ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి తనను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను అన్నివర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. వాస్తవానికి దగ్గరగా, పేద ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేదిగా ఈ మేనిఫెస్టో ఉందన్న భావన వ్యక్తం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో కూడా ఇచ్చిన మేనిఫెస్టోను తు.చ. తప్పకుండా అమలు చేసి మన్ననలు అందుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈసారి కూడా అదే తరహాలో ప్రకటించారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో అబద్ధాలతో కూడుకున్నదని, వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో వాస్తవానికి దగ్గరగా ఉందన్నారు. గతంలో కూడా టీడీపీ మాయమాటలను ప్రజలు నమ్మలేదని, ఇప్పుడు కూడా అదే రీతిలో తీర్పు ప్రకటిస్తారనే విశ్వాసాన్ని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి వ్యక్తం చేశారు. ఏడోసారి ఎన్నికలను చూస్తున్నానని, ఇప్పుడున్నంత స్పందన గతంలో ఎప్పుడూ, ఏ ప్రభుత్వ హయాంలోనూ చూడలేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే ప్రభుత్వంగా ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయనకు స్థానికులు పూలమాలలతో, హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ జగన్నాథన్ విజయ్‌కుమార్, స్థానిక నాయకులు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



తండ్రి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న కుమార్తె ప్రణీత



మామ చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి

కుమార్తె ఎన్నికల ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుమార్తె డాక్టర్ ప్రణీత 31వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. సూర్యనారాయణపురం మెయిన్ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఇంటింటా ప్రచారం చేసిన ఆమెకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. 2019 ఎన్నికలకు ముందు, ఆ తర్వాత జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని తన తండ్రి చంద్రశేఖరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారానికి వెళ్లిన సందర్భంగా ఆమెకు ప్రజలు స్వాగతం పలికి, స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమకు ఎన్నో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, తమ మద్దతు వారికేనంటూ భరోసానిచ్చారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లుడి ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. గాంధీనగర్ 41వ డివిజన్‌లోని వివిధ బహుళ అంతస్తుల భవనాలకు వెళ్లి, ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ, మామ ద్వారంపూడిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలను ప్రజలకు అందించారు. ఎంపీగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యేగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, తద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట న్యాయవాది పిల్లి శ్రీను, నాయకులు రామకృష్ణారెడ్డి, గోడి సత్యవతి వెంకట్, రాగం విక్రమ్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎస్పీ కార్యాలయ సందర్శన



విద్యార్థులు గీసిన చిత్రాన్ని అందుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

బాలాజీచెరువు: జిల్లా పోలీస్ కార్యాలయాన్ని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి పోలీస్ వ్యవస్థ, సాంకేతికతను ఉపయోగించి కేసుల ఛేదన తదితర అంశాలను తెలుసుకున్నారు. ఆపద వస్తే 100 నంబర్‌కు ఎలా సమాచారం ఇవ్వాలో ఎస్పీ వివరించారు. అనంతరం విద్యార్థులు గీసిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీలక్ష్మి, డీఎస్పీ ప్రమోద్, రిజర్వ్ ఆర్మ్ ఫోర్స్ హెడ్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వందన బోహర పాల్గొన్నారు.

రేపు సామ్రాజ్య పట్టాభిషేకం

బోట్‌క్లబ్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యారావుపేటలోని సీతారామస్వామి ఆలయంలో ఈ నెల 30న సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, 11 గంటలకు సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎన్ని కుయుక్తులు పన్నినా విజయం మాదే..



పార్టీలో చేరిన వారితో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, ద్వారంపూడి
- పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు

కాకినాడ: ఓటమి భయంతో కూటమి నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా, దుష్ప్రచారాలు చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరని పార్టీ కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహిస్తోన్న అడదాడి మహేష్ ఆధ్వర్యంలో స్థానిక 14వ డివిజన్ ఏటిమొగ ప్రాంతం నుంచి టీడీపీకి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం సునీల్, ద్వారంపూడి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. మత్స్యకార ప్రాంతమైన ఏటిమొగ నుంచి పార్టీలోకి వచ్చిన వారికి ఆహ్వానం పలుకుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటమి తప్పదని గ్రహించిన టీడీపీ, జనసేన కూటమి సభ్యులు నిరాధార ఆరోపణలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వీటిని ఏ ఒక్కరూ నమ్మొద్దని, దుష్ప్రచారాలను సమర్థంగా తిప్పికొట్టి పార్టీ విజయం కోసం పాటుపడాలని సూచించారు.

31వ డివిజన్ నుంచి..

స్థానిక 31వ డివిజన్ రాగంపేట నుంచి సుమారు 30 మంది టీడీపీ–జనసేన కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధానాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి వీరికి సూచించారు.

చేసిన మేలును గుర్తించండి

- జగనన్నను ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు
- సిరిపురం, జి.భావారం, యండమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



సిరిపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన సిరిపురం, జి.భావారం, యండమూరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు చేసిన పాలన, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. ఎవరి హయాంలో మేలు జరిగిందో ఆలోచన చేసి, ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసేవి, చేయగలిగిన హామీలు మాత్రమే ఇస్తారని, చంద్రబాబులా మోసపూరిత వాగ్దానాలు చేయరన్నారు. 2019లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడమే ఇందుకు తార్కాణమన్నారు. ప్రతి గ్రామంలో గత ఐదేళ్లలో రోడ్లు, డ్రైన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, సచివాలయ, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేసినట్టు చెప్పారు. మరింతగా సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని కన్నబాబు ఓటర్లను అభ్యర్థించారు. ఆయన వెంట ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పార్టీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, కాకినాడ మాజీ మేయర్ పొలసపల్లి సరోజ, మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, పార్టీ నాయకులు నున్న వీరబాబు, కోరుకొండ ఆదిలక్ష్మి, పల్ల వెంకన్న, రొక్కాల తారకేష్, మార్రెళ్ల వెంకటరమణ, రెడ్డి శ్రీనివాస్, నురుకుర్తి వీరన్న, షేక్ దరియా, కాదా వెంకటేశ్వరరావు, చింతా బుజ్జి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమకు డాక్టరేట్



మాదిరెడ్డి సుమ

బాలాజీచెరువు: పైడా కళాశాలలో మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాదిరెడ్డి సుమకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. టాలెంట్ మేనేజ్‌మెంట్ ఇన్ ఐటీ సెక్టార్ విత్ విన్ రిఫరెన్స్ టూ సెలెక్ట్ ఐటీ కంపెనీస్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై ఏయూ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ రమణమూర్తి పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించారు. సిద్ధాంత వ్యాసం పరిశీలించిన ఏయూ డాక్టరేట్(పీహెచ్‌డీ)ను ఆమోదించింది. ఈ సందర్భంగా సుమను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించింది.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కరప: వేళంగి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ ఏడో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠకులకు వివిధ అంశాలపై శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. కథలు వినడం–చెప్పడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్, డ్రాయింగ్ వంటి అంశాలపై శిబిరాలు ఉంటాయని తెలిపారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ





సమావేశానికి హాజరైన బీఎల్‌ఓలు. (అంతర చిత్రం) సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ జె.వెంకటరావు

- నేటి నుంచి మొదలై మే 8 వరకూ..
- బీఎల్‌ఓల సమావేశంలో ఆర్‌ఓ వెల్లడి

కాకినాడ: సార్వత్రిక ఎన్నికలకు మే 13న ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. సోమవారం నుంచి మొదలయ్యే ఓటరు స్లిప్పుల పంపిణీ వచ్చే నెల 8వ తేదీ వరకూ కొనసాగుతుందని చెప్పారు. ఈ అంశంపై స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ వెంకటరావు మాట్లాడుతూ సిటీ పరిధిలోని 234 పోలింగ్ బూత్‌ల పరిధిలో పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను సిద్ధం చేశామన్నారు. వీటిని బీఎల్‌ఓలకు పంపిణీ చేశామన్నారు. సోమవారం నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఓటర్ పేరు, ఇతర వివరాలతో స్లిప్పులను పంపిణీ చేస్తామని, ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో ఈ స్లిప్పుతో పాటు, నిర్ణీత గుర్తింపు కార్డును తీసుకువెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. కాగా ఒకటో తేదీన ఇవ్వాల్సిన పింఛన్ల పంపిణీతో పాటు, ఇతర అంశాలపై కూడా బీఎల్‌ఓలకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్‌ఓ చల్లన్నదొర, ఇతర ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- పుంజుకుంటున్న వరి కోతలు
- 60 శాతం పూర్తయిన పనులు
- పెరిగిన దిగుబడితో రైతుల్లో ఆనందం
- 48 గంటల్లోనే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము



సామర్లకోట మండలం అచ్చంపేటలో మెషీన్‌తో చేస్తున్న వరి కోతలు



ఏడీబీ రోడ్డులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు




ఆర్బీకేలకు ధాన్యం తరలించడానికి లోడింగ్ చేస్తున్న సామర్లకోట రైతులు

సామర్లకోట: దాళ్వా వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. సామర్లకోట మండలంలో 22,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో 80 శాతం బొండాలు సాగు చేయగా, మిగిలిన భూముల్లో సన్న రకాలైన ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, ఆర్‌ఎస్‌ఆర్ 15048 రకాలను సుమారు 4 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. ప్రతి పంటకు వ్యవసాయ అధికారులు రోస్టర్ పద్ధతిలో వరి కోత ప్రయోగాలను చేశారు. వీటి ఆధారంగా ఎకరానికి సన్నాలు 45 నుంచి 50 బస్తాలు, బొండాలు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తున్నట్టు వారు పేర్కొన్నారు. సన్నాలను గ్రేడ్–ఏ గాను, బొండాలను సాధారణ రకంగా గుర్తిస్తారు. వాతావరణం పంట కోతలకు అనుకూలంగా ఉండటంతో పాటు, ప్రస్తుత దాళ్వా సాగులో నీటి ఎద్దడి లేకపోవడం వల్ల రైతులు ఆనందంలో ఉన్నారు. పెద్దాపురం మండలంలో 8,300 ఎకరాల్లో దాళ్వా సాగు చేశారు. వీటిలో 60 శాతం బొండాలు, 40 శాతం సన్న రకాలు వేశారని మండల వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 4,200 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా, ఎకరానికి 40 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తున్నట్టు చెప్పారు.

వరి కోత మెషీన్లు అందుబాటులో ఉన్న రైతులు వాటి ద్వారానే కోతలు చేసుకుంటున్నారు. తుని, తొండంగి, కోటనందురు ప్రాంతాల్లో దాళ్వా సాగు అంతంతమాత్ర. అక్కడ వరి కోత మెషీన్లు అందుబాటులోకి రావడంతో, వరి కోత యంత్రాల కొరత లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మండలంలో ఐదు వరి కోత యంత్రాలను సబ్సిడీపై ఇవ్వడంతో, కోత మెషీన్లు ఇక్కడి రైతులకు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో 60 శాతం వరి కోతలు పూర్తయినట్టు మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కోతలు పూర్తి చేసుకున్న వారు ధాన్యాన్ని రోడ్లపై, పొలాల్లోను ఆరబెడుతున్నారు. వరి కోతలు పూర్తయితే గోదావరి కాలువను మూసివేస్తారు. దాంతో దాళ్వా కోతలు పూర్తి చేసుకున్న రైతులు.. అపరాల సాగుకు సన్నద్ధమవుతారు. కొంత మంది రైతులు తమ భూముల్లో సారవంతాన్ని పెంచేందుకు పచ్చిరొట్టను సాగు చేసి, దుక్కి చేస్తారు.


వాతావరణం అనుకూలించింది



ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతులు ఎక్కువగా బొండాలు సాగు చేశారు. మండలంలోని మూడు ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతులకు సమృద్ధిగా నీరందింది. రైతులకు అందుబాటులో వరి కోత యంత్రాలు ఉండటంతో, ప్రస్తుతం సన్నాలు వరి కోతలు పూర్తయ్యాయి. బొండాలు కోతలు జోరుగా జరుగుతున్నాయి. రైతులకు అందుబాటులో ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతులకు వేగంగా ధాన్యం సొమ్ము చెల్లింపులు జరుగుతున్నాయి.

– తలారి దొరబాబు, రైతు సంఘ నాయకుడు, వీకే రాయపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం



మండలంలో ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో 21 రైతు భరోసా కేంద్రాలుండగా, 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల ధాన్యం తేమ శాతం సమస్య ఎక్కువగా ఉండే అవకాశం లేదు. మండలంలో బొండాలు 80 శాతం సాగు చేశారు. 70 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతిలో సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యానికి 48 గంటల్లో నగదు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. గ్రేడ్–ఏ 100 కేజీల బస్తాకు రూ.2,203, 75 కేజీల బస్తాకు రూ.1,652, సాధారణ రకం 100 కేజీల బస్తాకు రూ.2,183, 75 కేజీల బస్తాకు రూ.1,637 గిట్టుబాటు ధర నిర్ణయించారు. ప్రతి రైతూ ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

ఎన్నికల విధులపై 30న ఓపీఓలకు శిక్షణ

ఆర్‌ఓ జె.వెంకటరావు వెల్లడి



శిక్షణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ జె.వెంకటరావు

కాకినాడ: ఎన్నికల విధులపై ఈ నెల 30న ఓపీఓలకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ ఏర్పాట్లను ఆర్‌ఓ వెంకటరావు ఆదివారం పరిశీలించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణను ఇస్తారన్నారు. పోలింగ్ ముందురోజు విధులు, పోలింగ్ రోజున చేపట్టాల్సిన విధులు, ఈవీఎం, వీవీప్యాట్ల నిర్వహణ సహా అన్ని అంశాలపై ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఇతర అధికారులు ఉన్నారు.